

నంది వాహనంపై ఊరేగుతున్న కాశీవిశ్వేశ్వరుడు


శివయ్యకు జలాభిషేకం...

పాహిమాం.. పరమేశ్వరా..!

- ఘనంగా మహాశివరాత్రి
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు


1వ రోడ్డు శివాలయం ముందు భక్తుల క్యూ..




మూడోరోడ్డు జీఆర్ ఫంక్షన్ హాల్‌లో..


రెవెన్యూకాలనీ రామాలయంలో అలంకరణ..

అనంతపురం కల్చరల్, మార్చి 8: మహాశివరాత్రి వేడుకలను శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఊరూవాడా అంతటా శివనామస్మరణతో మార్మోగాయి. స్థానిక మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో వేకువజామునుంచే కాశీవిశ్వేశ్వరునికి రుద్రాభిషేకాలు, యామపూజలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం శివపార్వతుల ఉత్సవమూర్తులను నందివాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం రాత్రి 12 గంటల తర్వాత లింగోద్భవకాలంలో కాశీవిశ్వేశ్వరున్ని దర్శించుకుని భక్తులు తరించిపోయారు. అనంతరం శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆరో రోడ్డులోని అమృతలింగేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రామచంద్రనగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రాత్రంతా జాగరణ మహోత్సవం నిర్వహించారు. పరిషత్ సభ్యుడు శ్రీపాద వేణు నేతృత్వంలో ఆధ్యాత్మిక ప్రశ్నల పోటీలు నిర్వహించడంతో పాటు భజనలు, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కాలభైరవ కంకణాల వితరణ చేశారు. మూడో రోడ్డులోని జీఆర్ ఫంక్షన్‌హాల్‌లో అనంత శివారాధన సమితి ఆధ్వర్యంలో కాశీవిశ్వేశ్వర లింగానికి భక్తుల చేతుల మీదుగా అభిషేకాలు, సాయంత్రం గిరిజా కల్యాణం నిర్వహించారు. రామచంద్రనగర్ షిర్డిసాయిబాబా ఆలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివబాలయోగి ఆశ్రమంలో శివకామేశ్వరులకు భక్తుల చేతుల మీదుగా క్షీరాభిషేకాలు, బిళ్వార్చన నిర్వహించారు. అదేవిధంగా మంచులింగం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తపోవనంలోని శివశక్తిసాయి దేవాలయంలో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా బెంగళూరురోడ్డులోని శివకోటి, హౌసింగ్‌బోర్డు వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని శివాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, అరవిందనగర్ సర్వేశ్వరాలయం, పాతూరు విరూపాక్షేశ్వరాలయం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయం, హెచ్చెల్సీ కాలనీ మంజునాథస్వామి దేవాలయం, చాముండేశ్వరి దేవాలయంలతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న శివాలయాలన్నింటిలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.






జీఆర్ ఫంక్షన్‌హాల్‌లో అలంకరణలో శివపార్వతులు... భక్తుల మొక్కులు...


టీటీడీ కల్యాణమండపంలో శివలింగానికి ప్రత్యేక అలంకరణ..

దళిత నేతలు

సహకరించండి

టీడీపీ నాయకులపై ఆరోపణలు చేయొద్దు

శింగనమల టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ



అనంతపురం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి నివాసంలో జరిగిన చర్చపై ఆరోపణలు చేయొద్దని టీడీపీ, జనసేన శింగనమల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ దళిత సంఘాల నేతలను కోరారు. ఈ విషయంలో విమర్శలు, ఆరోపణలు చేయకుండా తనకు సహకరించాలని ఆమె శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు తాను పనిచేస్తున్నానన్నారు. టీడీపీ పార్టీ ఒక కుటుంబం లాంటిదని, అలాంటప్పుడు అంతర్గతంగా కొన్ని విభేదాలు ఉంటాయని అన్నారు. ఇటువంటి సమయంలో టీడీపీ నాయకులు, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడులపై ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. టీడీపీ బడుగు, బలహీనవర్గాల పార్టీనన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలనే బేధం లేకుండా అందరికీ అండగా ఉండటమే పార్టీ ఉద్దేశమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. శింగనమల నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలందరూ సమష్టిగా పనిచేసి టీడీపీ జెండా ఎగురవేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతిఒక్కరూ శాయశక్తుల సైనికుల్లా పనిచేయాలన్నారు. ప్రతి రాజకీయ పార్టీలో గొడవలు ఉంటాయని, వాటిపై దళిత సంఘాల నాయకులు సోషల్ మీడియా ద్వారా టీడీపీ నాయకులపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. దళితులకు న్యాయం చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీనేనన్నారు. ఎమ్మెల్యేలను, స్పీకర్లను, మంత్రులను తయారు చేసిన ఘనత టీడీపీదేనని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ సంయమనం పాటించాలన్నారు. టీడీపీ హయాంలో శింగనమలలోని అన్ని మండలాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. వైసీపీ హయాంలో శింగనమలలోని దళితులకు ఎటువంటి న్యాయం, అభివృద్ధి జరగలేదని ఆమె అన్నారు.

గ్రామీణ ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతుండటం, భూగర్భజలాలు అడుగంటి పోవడం, విద్యుత్ సక్రమంగా లేకపోవడం వంటి కారణాలతో గ్రామాల్లో నీటి సమస్య జటిలమవుతోంది. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోంది. సర్పంచులు నిధుల కొరతతో గ్రామాలలో కాలిపోయిన తాగునీటి మోటార్లు మరమ్మతులు చేయించలేని దుస్థితిలో ఉన్నారు. దీంతో కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకునే పరిస్థితిని పల్లె ప్రజలు ఎదుర్కొంటున్నారు. - రాయదుర్గం


గుమ్మఘట్ట మండలం గొల్లలదొడ్డిలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో కొళాయి వద్ద ఎదురు చూస్తున్న మహిళలు

రాయదుర్గం టౌన్‌లో ..

రాయదుర్గం పట్టణం కణేకల్లు రోడ్డులో ఉన్న శనిమహాత్ముడి ఆలయ ప్రాంతం, వాల్మీకి నగర్, మొలకాల్మూరు రోడ్డు, కోతిగుట్ట, బైపాస్‌రోడ్డు, శాంతినగర్ ప్రాంతాల్లో ఐదురోజులకొకసారి నీరు విడుదల చేస్తున్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటి నిల్వ సమృద్ధిగా ఉన్నా పట్టణానికి నీటిని అందించే వ్యవస్థ పూర్తిగా విఫలమైంది. బీటీపీ రోడ్డులోని జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరుకు సంబంధించిన మోటారు పాడైపోయి వారం రోజులు కావస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. దీంతో అయా ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వేసవి కాలం కావడంతో నీటి కోసం సైకిళ్లు, వాహనాలలో దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. గతంలో రెండురోజుల కొకసారి నీటిని కొళాయిల ద్వారా మున్సిపల్ యంత్రాంగం అందించేది. ప్రస్తుతం రోజుల వ్యవధి పెంచి సరఫరా సమయాన్ని తగ్గించడంతో నీటి సమస్య తీవ్రమవుతోంది. ఇటీవల చెక్‌పోస్టు, కోతిగుట్ట ప్రాంతాలలో మహిళలు ఖాళీ బిందెలు చేతబట్టి ఆందోళన చేశారు. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేదు. మున్సిపల్ కార్యాలయంలో రెగ్యులర్ ఏఈ, డీఈలు కూడా లేకపోవడంతో నీటి సరఫరాకు సంబంధించి ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. కౌన్సిల్ సమావేశాలలో కౌన్సిలర్లు ఎక్కువ శాతం తాగునీటి సమస్య పైనే చర్చ జరిపి అధికారులపై ఒత్తిడి తెస్తున్నా ఫలితం మాత్రం శూన్యం.

బొమ్మనహాళ్‌లో..

మండలంలోని గోవిందవాడ, నేమకల్లు, దర్గాహొన్నూరు, మైలాపురం తదితర గ్రామాల్లో పరిస్థితి దారుణంగానే ఉంది. మరమ్మతులకు గురైన తాగునీటి పథకాలను పునరుద్ధరించడంపై ఆ శాఖ అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని తెలిసినా ఇప్పటివరకు ముందస్తు ప్రణాళిక లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గోవిందవాడ గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో గోవిందవాడక్రాస్‌లో ప్రయాణికులకు ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు నుంచి తీసుకెళుతున్నారు. మైలాపురం, నేమకల్లు గ్రామాల ప్రజలు వ్యవసాయ బోర్లపై ఆధారపడుతున్నా మని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గోవిందవాడ క్రాస్ వద్ద ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు నుంచి నీరు తీసుకెళ్తున్న దృశ్యం

గొంతెండుతోంది..!

గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి

- నివారించడంలో అధికార యంత్రాంగం విఫలం
- వ్యవసాయ బోరుబావుల వైపు ప్రజల పరుగులు
- నీటి సమస్యను పట్టించుకోని పాలకులు, అధికారులు

కణేకల్లు మండలంలో..

మండలంలోని పూలచెర్ల గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామానికి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంతో పాటు పంచాయతీ ఆధ్వర్యంలో రెండు బోర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. కానీ నెలరోజులుగా శ్రీరామిరెడ్డి పథకం నుంచి నీరు సక్రమంగా రాకపోవడంతో స్థానిక బీసీ కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి సరఫరా అయ్యే నీటిని మొదటి కాలనీలోనే ఎక్కువగా వాడుకుంటుండటంతో దిగువ కాలనీలకు వచ్చే టప్పటికి సమస్య ఏర్పడుతోంది. దీంతో ప్రజలు నీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. ఇక పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన బోర్లలో నీరు కూడా సక్రమంగా అందకపోవడంతో ప్రజలు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


పూలచెర్లలో ఇబ్బందులు

రాయదుర్గం మండలంలో..

మండలంలోని కెంచానపల్లి, వజ్రవన్నూరు, ఆర్‌బీవంక, చదం, జుంజురంపల్లి తదితర గ్రామాలలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. మండలంలో 28 గ్రామాలున్నాయి. దాదాపు 6, 7 గ్రామాలలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. కెంచానపల్లి, వజ్రవన్నూరు గ్రామాలలో నీటి ఎద్దడి ఏర్పడటంతో ఒక క్యాన్ రూ. 15, కడవ రూ. 10లు పెట్టి కొంటున్నారు. చదం గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడంతో రైతు భాస్కర్‌రెడ్డి తోటకు సంబంధించిన నీటిని గ్రామానికి అందిస్తున్నారు. జుంజురంపల్లి గ్రామ శివారులో ఉన్న జోగి, జంగాల కాలనీలకు తాగునీటి సరఫరా చేయకపోవడంతో 20 కుటుంబాలు నీటి కోసం అల్లాడిపోతున్నాయి. ఆర్‌బీవంక గ్రామంలో పగిలిన పైపులకు మరమ్మతులు చేయకపోవడంతో తాగునీరు వృథాగా వెళ్లింది. అధికారులు, సర్పంచులు స్పందించి పైపులకు మరమ్మతులు చేయించి, నీటి ఎద్దడిని నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మురడీ గ్రామంలో తోపుడుబండ్లపై నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

గుమ్మఘట్టలో ..

మండలంలోని కలుగోడు, పూలకుంట, జే వెంకటంపల్లి, తాళ్లకెర తదితర గ్రామాలలో తాగునీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం, బోరుబావులలో నీరు అడుగంటడంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. కలుగోడులో నాలుగువేలకు పైగా జనాభా ఉండగా ఒకే ఒక ఓహెచ్‌ఎస్ఆర్ ఉంది. గ్రామం అంతటికీ తాగునీరు అందక ప్రజలు రేయింబవళ్లు ఎదురు చూడాల్సిన పరిస్థితి. త్రీఫేస్ కరెంట్ రాత్రి వేళ వస్తుండగా తాగునీటి కోసం బీసీ, ఎస్సీ కాలనీ ప్రజలు నిద్రాహారాలు మాని నీటిని పట్టుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మరో రెండు ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకులను ఏర్పాటు చేసి అదనంగా బోరుబావులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డీ.హీరేహాళ్ మండలంలో..

మండలంలో 31 గ్రామాలు ఉండగా సగానికిపైగా గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. ముఖ్యంగా మండలంలోని మురడి, దొడగట్ట, పులకుర్తి, వసగుడ్డం తదితర గ్రామాలలో నీటి ఎద్దడి రోజు రోజుకు అధికమవుతోంది. మురడి గ్రామంలో గత రెండేళ్లుగా తాగునీటి సమస్య ఉన్నా పరిష్కరించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని గ్రామ ఎంపీటీసీ గంగాధర వాపోయారు. ఈ గ్రామాలలో కుటుంబ సభ్యులు వంతుల వారీగా పెద్దవారైతే పనులు, పిల్లలు అయితే పాఠశాలలు మానుకొని తాగునీటి సమకూర్చుకునే పనిలో ఉంటున్నారు. ఈ గ్రామంలో తోపుడు బండ్లతో కిలోమీటర్ల మేర వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.


మురడి గ్రామంలో నీటి కోసం తిప్పలు

యువతుల చదువుకు అండగా ఉంటాం

మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత



కలలకు రెక్కలు పథకం లక్ష్యం అదే

- వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ ఎక్కడ..?
- జగన్ వచ్చాక రెండు లక్షల మందికిపైగా మహిళల మీద నేరాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత వ్యాఖ్యలు

అనంతపురం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): కలలకు రెక్కలు పేరుతో యువతుల చదువుకు అండగా ఉంటామని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం, జనసేన కూటమి మహిళల కోసం కలలకు రెక్కలు పేరుతో ప్రకటించిన కొత్త పథకంపై పరిటాల సునీత స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె అనంతపురంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ... ముందుగా మహిళలకు ఆమె అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ... నేటికి వారిపై వివక్ష కొనసాగడం బాధాకరమన్నారు. సమాజంలో ఎదురయ్యే ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒకప్పుడు వంటింటికి పరిమితమైన తన జీవితం, భర్తని కోల్పోయి ఇలా రాజకీయ రంగంలోకి రావాల్సి వచ్చిందని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ రోజు నుంచి నేటి వరకూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానన్నారు. కానీ ఎప్పుడు వెనకడుగు వేయలేదన్నారు. తెలుగుదేశం పార్టీ మహిళలకు మొదటి నుంచి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఇప్పుడు తాజాగా కలలకు రెక్కలు అనే పేరుతో ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ కూడా చదువుకు సంబంధించి డబ్బుల కొరతతో ఇంటికి పరిమితం కాకూడదనే ఆలోచనతో నూతన పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఇంటర్మీడియట్ విజయవంతంగా పూర్తి చేసిన యువతులు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకుంటే బ్యాంకు లోన్‌కు తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. మొత్తం రుణానికి సంబంధించిన వడ్డీని టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. మరోవైపు గత టీడీపీ హయాంలో మహిళా రక్షణకు చంద్రబాబు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారన్నారు. ఫోర్త్ లయన్ యాప్, అభయ, షీ టీంల ఏర్పాటుతో మహిళలపై నేరాలకు అడ్డుకట్ట వేశారన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మహిళలపై రెండు లక్షలకుపైగా నేరాలు జరిగాయన్నారు. ఏపీని అత్యాచారాలకు అడ్డాగా మార్చేశారని విమర్శించారు. అందుకే తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి మహిళపై ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళా రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చి నిందితులకు సత్వరమే శిక్ష పడేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్-6 పథకాలతో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 18 ఏళ్ల దాటిన ప్రతి మహిళకు రూ. 1500 ఆర్థికసాయం, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికి అమ్మకు వందనం పేరుతో రూ. 15 వేలు ఆర్థిక సాయం చేయనున్నట్లు వివరించారు. అందుకే మహిళలంతా మరోసారి తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని ఆమె పిలుపునిచ్చారు.

విపరీత బుద్ధి..!

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 8: వైసీపీ నాయకులు.. ప్రజాసమస్యలను పరిష్కరించరు. ఎవరైనా తీర్చుతామంటే అడ్డుపడుతున్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధి ఎర్రనేల వీధిలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. కాలనీవాసులు ప్రియాంక, రాజు, తిప్పేస్వామి, కృష్ణవేణి, శ్రీధర్.. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు నీటి సమస్యను విన్నవించుకున్నారు. వారి సమస్య పరిష్కరించే దిశగా తక్షణమే బోరు వేయించేందుకు ఆయన ముందుకొచ్చారు. కాలనీలో బోరు వేసేందుకు అక్కడికి బోర్‌వెల్ వాహనాన్ని పంపారు. వాహనం అలా వచ్చిందో.. లేదో.. వెంటనే వైసీపీ నాయకులు రంగంలోకి దిగారు. పోలీసులను అక్కడకి పంపి, అడ్డుకున్నారు. కాలనీవాసులు ఇదెక్కడి న్యాయమంటూ నిలదీశారు. తాగడానికి గుక్కెడు నీళ్లలేక అల్లాడిపోతుంటే సమస్యలను పరిష్కరించాల్సిన అధికార పార్టీ నేతలు, అధికారులు అడ్డుకోవడం దుర్మార్గమని వాపోయారు. కాలనీవాసులు బోరు ఎందుకు వేయకూడదని పోలీసులను ప్రశ్నించారు. బోరు వేసేందుకు అనుమతులు లేవని పోలీసులు చెప్పడం గమనార్హం.


బోర్‌వెల్ వాహనాన్ని వెనక్కు పంపుతున్న పోలీసులు


మాట్లాడుతున్న కాలనీవాసులు

ఉష్ణోగ్రతలు (8-3-2024)	
గరిష్ఠం	38.5
కనిష్ఠం	24.0

నివేదిక కోరిన ఎన్నికల కమిషన్

రాయదుర్గం, మార్చి 8: మెప్మా విభాగంలోని ఆర్‌పీలతో వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి నివాసంలో సమావేశం ఏర్పాటు చేయడంపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు చేసిన ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ స్పందించింది. జిల్లా కలెక్టర్ గౌతమిని నివేదిక కోరింది. ఫిబ్రవరి 28న మెప్మా అర్‌పీలతో మెట్టు గోవిందరెడ్డి సమావేశం ఏర్పాటు చేసి, ఎన్నికల్లో సహకరించాలని కోరిన విషయం తెలిసిందే. దీనిపై టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు.. రాష్ట్ర ఎన్నికల అధికారితోపాటు జిల్లా కలెక్టర్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా.. సమగ్ర విచారణ చేపట్టి, నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ గౌతమిని ఆదేశించారు. రెండురోజుల్లో నివేదిక సమర్పించాల్సిందిగా అందులో పేర్కొన్నారు. ఇటీవల మెట్టు గోవిందరెడ్డి వెంట వలంటీర్లు, చౌకధాన్యపు డిపో డీలర్లు ప్రచారానికి వెళ్తున్నారు. దీనిపై కూడా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు.



ఆదరిస్తే.. అక్కున చేర్చుకున్నారు..


సభకు తరలి వచ్చిన మహిళలు

- ఎన్టీఆర్ ఇక్కడి నుంచే గెలిచి.. సీఎం అయ్యారు..
- ఇందిరాగాంధీ బర్తరఫ్ చేస్తే కొత్తచెరువు నుంచే ఉద్యమం మొదలైంది..
- బాలయ్యను గెలిపించారు..
- అనంత ప్రజల అభివృద్ధికి టీడీపీ ఎప్పుడూ ముందుంటుంది..
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- కొత్తచెరువు, కదిరిలో శంఖారావం సభలకు హాజరు
- భారీగా హాజరైన శ్రేణులు, జనం




కదిరిలో టీడీపీ నేతలతో కలిసి నారా లోకేశ్ అభివాదం


కందికుంటకు సూపర్ సిక్స్ కిట్ అందజేస్తున్న లోకేశ్, యువనేతతో పల్లె


కొత్తచెరువు సభలో ఉత్తమ కార్యకర్త ప్రశంసాపత్రాలను చూపుతున్న దృశ్యం


రత్నాకర్‌తో లోకేశ్..



ధర్మవరం/కొత్తచెరువు, మార్చి 8: ఆదరిస్తే.. అనంత ప్రజలు అక్కున చేర్చుకున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కొనియాడారు. నందమూరి తారక రామారావును గెలిపించి, ముఖ్యమంత్రిని చేసిన ఘనత అనంత ప్రజలది అన్నారు. బాలయ్యను ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారన్నారు. ఇందిరాగాంధీ.. ఎన్టీఆర్‌ను బర్తరఫ్ చేస్తే ఉమ్మడి రాష్ట్రంలోనే ఉద్యమం మొదలైంది కొత్తచెరువు గడ్డపైనే అన్నారు. ఆయన కోసం ఇద్దరు ప్రాణాలు అర్పించడం, మరో ఆరుగురు గాయపడ్డారన్నారు. అలాంటి కొత్తచెరువులో శంఖారావం పూరించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. నారా లోకేశ్ జిల్లా పర్యటనలో భాగంగా రెండోరోజు శుక్రవారం పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో శంఖారావం సభలు నిర్వహించారు. పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించి కొత్తచెరువు మండల కేంద్రంలో ధర్మవరం రహదారి పక్కన శంఖారావం బహిరంగ సభను మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. తొలుత టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి నారా లోకేశ్ పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... టీడీపీ హయాంలో పుట్టపర్తి ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. జగన్ పాలనలో అభివృద్ధి అటకెక్కిందన్నారు. నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా జగన్.. పుట్టపర్తిని టూరిజం హబ్‌గా మారుస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పుట్టపర్తిలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. మారాల రిజర్వాయర్‌ను టీడీపీ హయాంలో పూర్తి చేస్తే.. అనుబంధంగా పంట కాలువలు తవ్వుతామని చెప్పి నేటికీ జగన్ నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అవినీతి కుంట అని ఎద్దేవా చేశారు. ఆయన పుట్టపర్తి నియోజకవర్గాన్ని దోచుకునేందుకు వచ్చారన్నారు. లేఔట్లు వేసిన వారి నుంచి కప్పం కట్టించుకోలేదా, ప్రతిపనికీ రేటు ఫిక్స్ చేయలేదా అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గంలోని చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా నీరిస్తామని చెప్పారన్నారు. ఒక్క చెరువుకైనా ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. రేషన్‌బియ్యం, భూ పట్టాల్లో అవినీతికి పాల్పండ్డారంటూ ఆరోపించారు. జగన్‌కు, ఎమ్మెల్యే దుద్దుకుంటకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి, టీడీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

193 చెరువులకు నీరిస్తాం

టీడీపీ అధికారంలోకి రాగానే పుట్టపర్తి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని లోకేశ్ హామీ ఇచ్చారు. బుక్కపట్నం చెరువు నిర్వాసిత రైతులను ఆదుకుంటామనీ, మూడు మండలాలను కలుపుతూ రింగ్‌రోడ్డు, 193 చెరువులకు నీరందించే బాధ్యత టీడీపీ,జనసేన ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక యువతీయువకులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. పుట్టపర్తి సమీపంలో పరిశ్రమలు ఏర్పాటు చేయించి, వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత తీసుకుంటానన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే టిడ్కో ఇళ్లను పూర్తి చేసి, లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.


కొత్తచెరువు సభలో మహిళా కార్యకర్త ఉత్సాహం


కదిరి సభలో అభిమానుల ఉత్సాహం..

కదిరి అభివృద్ధికి లోకేశ్ హామీ

కదిరి: పట్టణంలోని కొత్త బైపాస్ రోడ్డు వద్ద శంఖారావం సభను నిర్వహించారు. కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ అధ్యక్షత వహించారు. పార్టీవ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ.. లక్ష్మీనరసింహస్వామి ఆలయమున్న కదిరి పుణ్యభూమి అన్నారు. కదిరి ప్రజల జోష్ వేరన్నారు. కదిరి నియోజకవర్గాన్ని జీవితాంతం గుర్తు పెట్టుకుంటానన్నారు. పాదయాత్ర సందర్భంగా ఓ తాత తన చేయి పట్టుకుని చేయి నొప్పి వచ్చేవరకు వదలలేదన్నారు. కదిరిని టీడీపీ రూ.1200 కోట్లతో అభివృద్ధి చేసిందన్నారు. షాదీమహల్, కమ్యూనిటీ హాల్, ఇండోర్ స్టేడియం కట్టామన్నారు. డ్యామ్‌లు, బస్టాండు, సీసీ, బీటీ రోడ్లు, తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు. జగన్ పాదయాత్ర సందర్భంగా భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. నేటికీ ఆ ఊసేలేదన్నారు. ఒక్క పరిశ్రమ తీసుకురాలేదన్నారు. ఆస్పత్రిని అభివృద్ధి చేయలేదన్నారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి అవినీతిలో సిద్ధహస్తుడన్నారు. సోలార్ పార్కులో రూ.8 కోట్లు వసూలు చేసిన ఘనత ఎమ్మెల్యేదే అన్నారు. ఏపని చేయాలన్నా కమీషన్ ఇవ్వాల్సిందేనన్నారు. చివరకు లక్ష్మీనరసింహస్వామి డబ్బు కూడా కాజేసిన వ్యక్తి ఎమ్మెల్యే అన్నారు. 'దేవుడితో పెట్టుకున్నావ్.. నీపని గోవింద' అంటూ ఎమ్మెల్యేని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చాక హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా ప్రతి ఎకరాకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. టమోటా, వేరుశగన రైతులను ఆదుకుంటామన్నారు. ఉపాధికోసం ఇతర దేశాలకు వెళ్లేవారికి ఇక్కడే శిక్షణ ఇచ్చి, రాష్ట్రంలో, స్థానికంగా జీవనోపాధి కల్పిస్తామన్నారు. రానున్న 40 రోజులు ప్రతి కార్యకర్త చురుగ్గా పనిచేసి, టీడీపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. అనంతరం కార్యకర్తలతో టీడీపీ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జనసేన కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్, టీడీపీ నాయకులు అత్తార్‌చాంద్‌బాషా, పవన్‌కుమార్‌రెడ్డి, పెద్దసంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరి మృతి

తాడిమర్రి, మార్చి8: మండలంలోని దాడితోట సమీపాన ఆర్టీసీ బస్సు అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం అంతరగంగ గ్రామానికి చెందిన మహేశ్ (35).. అనంతపురంలో నివాసముంటున్న సాంబమూర్తి(61)తో కలిసి బైక్‌లో శుక్రవారం ఉదయం తాడిమర్రి మండలం చిల్లవారిపల్లికి వెళ్లాడు. కాటకోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆ తరువాత పులివెందుల దగ్గరున్న బలపనూరు గ్రామానికి వెళ్లడానికి దాడి తోటకు చేరుకున్నారు. అక్కడి నుంచి సమీపంలోని బైపాసు రోడ్డువైపునకు బయలుదేరారు. కొద్ది దూరం వెళ్లాక ఎదురుగా వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ఢీకొట్టింది. ప్రమాదంలో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందగా... సాంబమూర్తి కోమాలోకి వెళ్లాడు. ఆ సమయంలో ఆ దారిలోనే వెళ్తున్న తాడిమర్రి ఎస్ఐ నాగస్వామి.. పోలీసు వాహనంలోనే సాంబమూర్తిని అంబులెన్స్ వరకు తరలించి అక్కడి నుంచి అనంతపురం సవేరా ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం ఆయన మృతి చెందాడు. వెల్డింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మహేశ్‌కు భార్య తేజస్వినితో పాటు నాలుగు సంవత్సరాల వయసు గల కుమారుడు మానసతేజ్ ఉన్నారు. ప్రస్తుతం తేజస్విని మూడు నెలల గర్భిణి అని బంధువులు తెలిపారు. సాంబమూర్తి కుటుంబ వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బస్సు డ్రైవర్ పవన్‌కుమార్ అతి వేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగినట్టు ప్రయాణికులే ఫిర్యాదు చేశారు. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.


మహేశ్(ఫైల్)


రోదిస్తున్న కుటుంబీకులు

చీనీకాయలు టన్ను రూ.20వేలు

అనంతపురంరూరల్,మార్చి 8: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తానికి 276 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఇంజనీర్లు లేక ఇక్కట్లు..!

- జేఈల కొరత ఉన్నా డీఈఈలుగా అదనపు బాధ్యతలు
- పనిలేని విభాగాల్లో ఖాళీగా కొందరు..
- సర్దుబాటు చేయని ఉన్నతాధికారులు
- మందగించిన అభివృద్ధి పనులు

అనంతపురం, సిటీ, మార్చి 8: అసలే సిబ్బంది కొరత.. మళ్లీ వారికి అదనపు బాధ్యతలు. అభివృద్ధి మందగిస్తున్నా పట్టించుకోని అధికారులు.. ఇలా పంచాయతీరాజ్ శాఖలో గందరగోళం నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖలో ఇన్‌చార్జిలుగా విధులు నిర్వహిస్తున్న కొందరు అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకపోగా.. వివిధ రూపాల్లో పెత్తనం ప్రదర్శిస్తున్నారు. మండల ఇంజనీర్ల కొరత ఉన్నప్పటికీ కొందరు జేఈలకు డీఈఈలుగా ఇన్‌చార్జి బాధ్యతలు కట్టపెట్టడంతో మండల ప్రాంతాల్లో ఇంజనీర్ల కొరత ఏర్పడింది. దీంతో అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఆ శాఖ ఉన్నతాధికారులు సైతం క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల నాణ్యతపై దృష్టి పెట్టడం లేదు. పని తక్కువగా ఉండే క్యూసీ, పీఐయూ విభాగాలకు మాత్రం ఇంజనీర్లు, డీఈఈల కొరత లేకుండా కేటాయించడంతో లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటూ.. ఖాళీగా కూర్చున్నారనే విమర్శలు ఆ శాఖలోనే వినిపిస్తున్నాయి. కొందరైతే డెప్యుటేషన్‌పై కూడా ఆయా విభాగాల్లో పనిచేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. ఇప్పటికైనా ఆశాఖ ఉన్నతాధికారులు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు స్పందించి సర్దుబాటు చేయడంతోపాటు రెగ్యులర్ డీఈఈలను కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డీఈఈలుగా అదనపు బాధ్యతలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 63 మండలాల్లో నిబంధనల ప్రకారం.. ఒక్కో మండలానికి ఒక మండల ఇంజనీర్ (జేఈ) ఉండాలి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 40 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన 23 మండలాలకు జేఈలు లేరు. ఈ 40 మందిలో కొందరికి రెండు, మూడు మండలాల అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయాప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయింది. ఈ సమయంలో పని తక్కువగా ఉన్న క్యూసీ, పీఐయూ విభాగాల నుంచి జేఈలను కేటాయించకపోగా.. ఉన్న 40 మందిలోనే.. కొందరు జేఈలకు డీఈఈలుగా ఇన్‌చార్జి పదవులు కట్ట బెట్టారు. అభివృద్ధి పనులు అటుంచి డీఈఈ హోదాలో సేద తీరుతున్నారనే విమర్శలు లేకపోలేదు. శాఖలోని పలు విభాగాల్లో ఆఫీస్ డీఈఈలుగా పాతుకుపోవడంతో రెగ్యులర్ డీఈఈల కొరత మరింత ఎక్కువైందని ఆశాఖ వర్గాలు వాపోతున్నారు.

పని లేకున్నా పాతుకుపోయారు...

ప్రభుత్వంతో పాటు ఆశాఖ కమిషనర్లు, ఆయా జిల్లాల కలెక్టర్లు నిత్యం సమీక్షలు, వీసీలు జరుపుతున్నా అభివృద్ధి మం దగించిందని అధికార లెక్కలే వెల్లడిస్తున్నాయి. మండల ఇంజనీర్ల (జేఈ)ల కొరత ఉన్న ప్రాంతాలకు జేఈలను కేటాయించి పనుల్లో పురోగతి పెంచడం లేదు. పని తక్కువగా ఉన్న క్యూసీ, పీఐయూ విభాగాల్లో పుష్కలంగా ఉన్న కొందరు జేఈలతో పాటు డీఈఈలనైనా కేటాయించి మండల ప్రాంతాల్లో అభివృద్ధి పనుల్లో పురోగతిని పెంచే దిశగా ఆలోచన చేయకపోవడం విడ్డూరం. సర్దుబాటు చేయకపోవడంతో ఏళ్ల తరబడి పాతుకుపోయారనే విమర్శలు లేకపోలేదు.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇలా..

అనంతపురం జిల్లాలో జేఈ పోస్టు ఖాళీలు :	12
శ్రీ సత్యసాయి జిల్లాలో జేఈ పోస్టు ఖాళీలు :	11
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మండల ఇంజనీర్లు :	40
ఉమ్మడి జిల్లా పీఐయూ విభాగంలో ఇంజనీర్లు :	18
ఉమ్మడి జిల్లాలో క్యూసీ విభాగంలోని ఇంజనీర్లు :	12


పంచాయతీ రాజ్ శాఖ జిల్లా కార్యాలయం

కుంటుపడిన అభివృద్ధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. 14 నియోజకవర్గాల్లో కేవలం మూడు నియోజకవర్గాల్లో మాత్రమే 80శాతం పురోగతి ఉన్నట్లు అధికార లెక్కలు చెప్తున్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో 50శాతం కూడా పనులు దాటలేదని తెలిసింది. మరికొన్నింటిలో 40శాతం పనులు కూడా జరగకపోవడం దారుణం. ఇంతలా అభివృద్ధి ఆగిపోయినా.. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఉద్యోగుల సర్దుబాటు విషయంలో మౌనం ప్రదర్శించడంపై పలు సందేహాలు కలుగుతున్నాయి. ఇదిలా ఉండగా.. కొందరు జేఈలు, డీఈఈలు మండల ప్రాంతాల్లో పనిచేయడం భారంగా భావించి పైరవీలు..సిపార్సులతో పని తక్కువగా ఉన్న క్యూసీ, పీఐఊ విభాగాల్లో చేరిపోయారని ఆశాఖ వర్గాలే ఆరోపిస్తున్నాయి.

అదనపు బాధ్యతలు వాస్తవమే...

ఈరస్వామి. పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీఈఈల కొరతతో కొందరు జేఈలకు ఇన్‌చార్జి డీఈఈలుగా బాధ్యతలు అప్పగించడం వాస్తవమే. మండలాల్లో జేఈల కొరత ఉంది. డీఈఈలుగా బాధ్యత తీసుకుని పురోగతి లేకున్నా.. స్థాయిని విస్మరించి ప్రవర్తిస్తుంటే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. నేను కొత్తగా వచ్చాను. ఎక్కడైనా నిబంధనలు అతిక్రమంచి విధులు కొనసాగిస్తుంటే పరిశీలించి సర్దుబాటు చేస్తాం. శాఖాపరంగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం.

శింగనమలలో డెంగీ విజృంభణ

- ఆస్పత్రుల్లో చేరిన చిన్నారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు


చికిత్స పొందుతున్న చిన్నారులు

శింగనమల, మార్చి 8: మండలంలోని పలు గ్రామాల్లో 20 రోజులుగా డెంగీ విజృంభిస్తోంది. అనేకమంది చిన్నారులు డెంగీ జ్వరంతో విలవిల్లాడుతున్నారు. ఒక్కసారిగా రక్తకణాలు తగ్గిపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. శింగనమల గొల్లవీధికి చెందిన చిన్నారులు కుందర్‌యాదవ్, మంగళ యశ్వంత్ కుమార్, ఆనందరావు పేట గ్రామానికి చెందిన చిన్నారి అశ్విత, సీ.బండమీదపల్లికి చెందిన చరణ్ డెంగీతో అనంతపురం పెద్ద ఆసుపత్రి, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డెంగీ బాధితులతో శింగనమల ఆసుపత్రి కిటకిటలాడుతోంది. శింగనమల కమ్యూనిటి హెల్త్ ఆసుపత్రి, తరిమెల ప్రాథమిక కేంద్రంలో రాత్రి సమయాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పిల్లలను జిల్లా కేంద్రం, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్పిస్తున్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్రత ఉండటంతోనే పిల్లలు డెంగీ బారిన పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామాల్లో అపరిశుభ్రతను తొలగించేలా.. ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలి

- జైభీమ్ పార్టీ పులివెందుల ఇన్‌చార్జి దస్తగిరి

రాప్తాడు, మార్చి 8: ప్రసన్నాయపల్లి సమీపంలో 123-2బిలో దళితులు వేసుకున్న గుడిసెలకు నిప్పు పెట్టి... దళితులపై దాడులకు పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని జై భీమ్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ దస్తగిరి డిమాండ్ చేశారు. వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన దళితులను దస్తగిరి శుక్రవారం పరామర్శించారు. అనంతపురం నగరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ భూమిలో గుడిసెలు దళితులు వేసుకుంటే వైసీపీ నాయకులు దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఇళ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే ఇంత దౌర్జన్యం చేస్తారా అని ప్రశ్నించారు. ఆ భూమి ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులే నిర్ధారించారని, ఆ భూమిలో గుడిసెలు వేసుకుంటే ఎందుకు దాడులకు పాల్పడ్డారని ప్రశ్నించారు. జైభీమ్ పార్టీ కార్యకర్తలకు ఎక్కడ అన్యాయం జరిగినా వెళ్లి ప్రశ్నిస్తామని తెలిపారు. వివేకానంద హత్య కేసులో నిందితుడు వచ్చాడని ప్రకాష్‌రెడ్డి ప్రెస్ మీట్‌లో చెప్పడం దుర్మార్గమన్నారు. దళితులపై దౌర్జన్యంగా దాడులు చేస్తే నిందితులకు బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిపై 305, 307 సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలన్నారు.


అనంతపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న దస్తగిరి



మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరుడి నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు




తపోవనం చిన్మయ జగదీశ్వరాలయంలో..



మూడో రోడ్డు జీఆర్ ఫంక్షన్‌హాల్‌లో..



టీటీడీ కల్యాణమండపంలో..



శివకోటి దేవాలయంలో..



పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో..



శారదానగర్ శివబాలయోగి ఆశ్రమంలో ..



శివబాలయోగి ఆశ్రమంలో పార్థివ లింగ పూజలో పాల్గొన్న భక్తులు



శారదానగర్‌లో శివలింగాలకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

హరహర మహాదేవ..

శంభోశంకర

ఘనంగా మహాశివరాత్రి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: నగరం, రూరల్ ప్రాంతాల్లో మహాశివరాత్రి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. రామగిరి శివాలయంలో మాజీ మంత్రి పరిటాల సునీత ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం చౌదరి అనంతపురంలోని చిన్మయా జగదీశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. తపోవనం శివాలయంలో విద్యుత్ అలంకరణ కోసం కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీ, నాయకులు కంతా శ్రీనివాసులు రూ.50వేలు విరాళం అందించారు. చెన్నేకొత్తపల్లి సమీపంలోని కోనకన్వాశ్రమంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రాత్రి 12గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం అత్యంత కమనీయంగా సాగింది. భక్తుల శివనామస్మరణతో కోనక్షేత్రం మారుమ్రోగింది. గార్లదిన్నె మండలంలోని గార్లదిన్నె, మర్తాడు, పెనకచెర్ల, యర్రగుంట్ల, కొప్పలకొండ తదితర గ్రామాల్లో మహాశివరాత్రిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గార్లదిన్నె, మండల పరిధిలోని పెనకచెర్ల గ్రామంలో అవధూత చితంబరప్పస్వామి రథోత్సవం శనివారం రాత్రి నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. బుక్కరాయసముద్రం ముసలమ్మ కట్ట వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వరుడు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతపురంరూరల్ మండలంలో శివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఆత్మకూరు మండలం సనప గ్రామంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.



శివబాలయోగి ఆశ్రమంలో మంచు లింగం



రామగిరి శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత



టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం చౌదరిని సత్కరిస్తున్న స్వామి ఆత్మవిదానంద సరస్వతి






అలంకరణలో కోనమల్లికార్జున స్వామి, గార్లదిన్నెలో మల్లికార్జున స్వామి, ముసలమ్మ కట్ట కాశీవిశ్వేశ్వరస్వామి ఆకుతోటపల్లి గ్రామం మారుతీపురంలోని శ్రీ మేధా దక్షిణామూర్తిస్వామి




సనపలో రామలింగేశ్వర స్వామి, అవధూత చితంబరప్పస్వామి



జీఆర్ ఫంక్షన్‌హాల్‌లో స్వామివారికి జలాభిషేకం



పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శివలింగానికి పాలాభిషేకం



మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం వద్ద భక్తుల రద్దీ

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా రామలింగారెడ్డి



బుక్కరాయసముద్రం: మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కే రామలింగా రెడ్డిని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ పదవి తమకు వద్దని చెప్పడంతో ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర కమిటీ ప్రకటన విడుదల చేసింది.

ఓటరు జాబితా సవరణకు సహకరించని బీఎల్ఓ

మితిమీరిన సచివాలయ సిబ్బంది జోక్యం



బ్యాళ్ల రాము

అనంతపురంరూరల్, మార్చి 8: ఓటరు జాబితాలోని అనర్హుల ఓట్లను తొలగించేందుకు బీఎల్ఓ నాగలక్ష్మి సహకరించడం లేదని, దీనిపై ఆమెను ప్రశ్నిస్తే సచివాలయ ఉద్యోగి రాజేంద్ర ప్రసాద్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడని టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బ్యాళ్ల రాము ఆరోపించారు. శుక్రవారం ఆయన కొడిమి గ్రామంలోని తన నివాసంలో మాట్లా డుతూ... కొడిమి పంచాయతీ పరిధిలోని 45 బూత్‌లో 500కి పైగా ఫారం-7 దరఖాస్తులు చేశామని, ఇందులో 210 డిలీట్ చేశారని, మిగిలిన ఓట్లు తొలగించలేదని అన్నారు. ఈ విషయంపై బీఎల్ఓ నాగలక్ష్మికు ఫోన్ చేస్తే ఆమె లిఫ్ట్ చేయలేదని, దీనిపై మండల ఎన్నికల అధికారికి వినతి పత్రం ఇచ్చామని అన్నారు. ఈ క్రమంలో బీఎల్ఓ నాగజ్యోతి, వీఆర్వో, ఇరు పార్టీల బీఎల్ఏల సమక్షంలో వెరిఫికేషన్‌కు వచ్చారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటూ.. ఓటరు జాబితా సమస్యలపై ఫోన్ చేస్తే ఎందుకు స్పందించడం లేదని బీఎల్ఓను ఆ సందర్భంగా ప్రశ్నించామన్నారు. ఇంతలోనే సచివాలయ ఉద్యోగి ఇంజనీర్ అసిస్టెంట్ రాజేంద్ర ప్రసాద్ కలుగచేసుకుని 'మీ ఫోన్లు ఎత్తం.. మీరు ఏం చేయగలరు.. మా ఇష్టం ఉంటే ఫోన్ ఎత్తుతాం. లేదంటే లేదంటూ..' అంటూ దురుసుగా వ్యవహరించారన్నారు. ఓటరు జాబితా విషయంలో సచివాలయ సిబ్బంది జోక్యం చేసుకోరాదని కోర్టు ఆదేశాలున్నా... సచివాలయ ఉద్యోగి ఇలా జోక్యం చేసుకొంటున్నా.. బీఎల్ఓ ఏ మాత్రం స్పందించడం లేదన్నారు. ఈ విషయంలో ఎన్నికల అధికారులు జోక్యం చేసుకొని ఓటరు జాబితాలో తప్పులను సరిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైకుంఠంకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని ప్రార్థనలు



అజ్మీర్ దర్గా వద్ద టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్ మార్చి 8: మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని కోరుతూ టీడీపీ మైనార్టీ నాయకులు అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ మేరకు శుక్రవారం టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు జేఎం బాషా, నౌజియా రఫి, రియాజ్, ఫక్రుద్దీన్, ఖాజా తదితరులు అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయడంతో పాటు చాదర్ సమర్పించారు.

ప్రకాష్‌రెడ్డీ.. నీ కేసుల గురించి తెలుసుకో..!

మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజం

రాప్తాడు, మార్చి 8: రక్త చరిత్రలు గురించి మాట్లాడే ముందు. రక్తపు మరకలు ఎవరికి అంటాయో, ఎవరిపై ఎన్ని కేసులో ఉన్నాయో తెలుసుకో ప్రకాష్‌రెడ్డీ అని మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజమెత్తారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంచి ఆ పథకాల గురించి వివరించారు. బీసీ డిక్లరేషన్ అంశా లను ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడు తూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువా తే రాప్తాడులో నీళ్లు పారించామని తెలిపారు. కుటుంబ చరిత్రల గురించి వక్రీకరిస్తూ మాట్లాడడం ప్రకాష్ రెడ్డికి అలవాటైందని మండిపడ్డారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కొత్తపల్లి వైసీపీ ముఖ్య నాయకులు టీడీపీలోకి చేరారు. మాజీ వైస్ సర్పంచ్‌లు పెద్ద పుల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, నాయకులు నారాయణస్వామి, ప్రతాప్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, కేశవాచారి, బాబయ్య, భాస్కర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శీవారెడ్డి, చిన్నబాలిరెడ్డి, రవి, నెట్టికంటి ఆదినారాయణ, వేణుగోపాల్, షామీర్, అశ్వర్థప్ప, నాగేంద్ర, నల్లప్ప, భాస్కర్‌రెడ్డి, పోతులయ్యతో పాటూ మొత్తం 25 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. వారం దరికీ పరిటాల సునీత పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, సాకే జయరా ముడు, తెలుగు యువత మండలా ధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు క్రిష్ణమోహన్, అనంతనేని రామ కృష్ణ, కుమార్, సోమర నారాయణస్వామి, రమేష్, మోహన్, రామానాయుడు, చింతలయ్య, సూర్యనారాయణ, నాగేషు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 8: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముస్లిం, మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గఫూర్ కాలనీలోని మహమ్మదీయ మసీదు నుంచి పలువురు ముస్లిం, మైనార్టీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటు కేటాయించాలన్నారు. లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమా లను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో డాక్టర్ గఫూర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ నాయకులు మహబూబ్ బాషా, టిప్పు సుల్తాన్ అభిమాన సంఘం అధ్యక్షుడు జాకీర్, ఏపీ హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు షబ్బీర్, నాయకులు నూర్ మహమ్మద్, ఇమ్రాన్, రహంతుల్లా, మహబూబ్ బాషా, అబ్దుల్ రజాక్, ఇస్మాయిల్, జబీవుల్లా పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీలు

లాక్రోస్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్ : లాక్రోస్ జిల్లా స్థాయి బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా లాక్రోస్ క్రీడా అసోసియేషన్ కార్యదర్శి రాధిక తెలిపారు. బాలికల జట్టులో...సుకన్య, అక్షయ, ద్రాక్షాయని, శ్వేత, బృందా, గీత, బాలుర జట్టులో... కార్తీక్, ఆది, అరుణ్‌కుమార్, బాషా, ఆదెన్న, వీరజిన్న, శ్రీనివాసులు, తారక్, మహేష్, అరుణ్‌కుమార్ నాయక్, విష్ణుమూర్తి నాయక్ ఎంపికైన వారిలో ఉన్నారన్నారు. శని, ఆదివారాల్లో ప్రకాశం జిల్లా సింగరాయకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి లాక్రోస్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

శివాలయ నిర్మాణానికి భూమి పూజ

అనంతపురంరూరల్,మార్చి 8: రుద్రంపేట పంచాయతీ ఎంపీయూపీ పాఠశాల వీధిలో నూతన శివాలయం, నాగుల కట్ట నిర్మాణానికి స్థానికులు శుక్రవారం భూమి పూజ చేశారు. స్థానికంగా ఉన్న నాగుల కట్ట దెబ్బతినడంతో నూతనంగా నిర్మాణం చేయడానికి నిర్ణయించారు.

తెగుళ్ల నుంచి వేరుశనగ పంటను కాపాడుకోండి

రాప్తాడు: వేరుశనగ ప్రస్తుతం కాయ, గింజపట్టే దశలో ఉందని, ప్రస్తుతం ఆకు మచ్చతెగులు, కాండం తెగుళ్లు ఆశించినట్లు వ్యవసాయ శాఖ డీడీ మద్దిలేటి తెలిపారు. వాటి నివారణకు లీటరు నీటికి ఐదు గ్రాముల అన్న బేది మరియు ఒక గ్రాము సిట్రిక్ ఆమ్లం కలుకుని పిచికారీ చేయాలన్నారు. ఆకు మచ్చ తెగులు నివారణకు హెక్సాకొనాజోల్ ను లీటరు నీటికి 2 ఎంల్ కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. కాండం కుళ్లు, బూజు తెగులు ఉంటే మ్యాంకోజెల్, స్పింట్ విత్తన శుద్ధి కలుపుకోవాలని, ఎకరానికి 20 కిలోల జిప్సం పూత సమయంలో వేసుకోవాలన్నారు.



సింగంపల్లిలో టీడీపీ నాయకుల ప్రచారం

సింగంపల్లిలో ప్రచారం

ఆత్మకూరు, మార్చి 8: రాప్తాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి పరిటాల సునీతను అధిక మెజార్టీతో గెలిపించాలని శుక్రవారం సింగంపల్లిలో ఆ పార్టీ మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో వారు కరపత్రాలను పంచారు. కార్యక్ర మంలో మండల ఇన్‌చార్జి బాలాజి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీఎల్‌లో కదిరి, తపోవనం జట్ల విజయం




అర్జున్ టెండూల్కర్, ఆల్‌రౌండర్ నిశ్చయ్

అనంతపురం క్లాక్ టవర్, మార్చి 8: జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో 14వ విడత సీనియర్ ఏపీఎల్ టీ-20 క్రికెట్ పోటీలు నిర్వహించారు. తపోవనం క్రికెట్ అకాడ మీ, కదిరి జట్లు విజయం సాధించాయి. ఏడీసీఏ కదిరి, క్రికెట్ లవర్స్ అనంతపూరం జట్లు తలపడగా...మొదట బ్యాటింగ్ చేసిన కదిరి నిర్ణీత 20ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన అనంతపూరం 18.4ఓవర్లలో 158పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో కదిరి 20పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆల్‌రౌండ్ షో ప్రదర్శించిన నిశ్చయ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. మరో మ్యాచ్‌లో తపోవనం క్రికెట్ అకాడమీ, హిందూపురం జట్లు మధ్య జరగ్గా... మొదట బ్యాటింగ్ చేసిన హిందూపురం నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 148 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు కేవలం 16 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అలవోకగా చేధించింది. ఇందులో అర్జున్ టెండూల్కర్ 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 95 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

బామ్మర్దిపై బావ హత్యాయత్నం

గార్లదిన్నె, మార్చి 8: మండలంలోని పెనకచెర్ల గ్రామంలో గురువారం బామ్మర్దిపై బావ హత్యాయత్నం చేశాడు. తెలంగాణ రాష్ట్రం హైదారాబాదులోని కుందన్‌బాగ్ బేగంపేటకు చెందిన బోతుల వేణు పెనకచెర్ల గ్రామంలో ఉన్న అక్కలు లలిత, సరిత ఇంటికి శివరాత్రి పండుగకు వచ్చాడు. వేణు పెనకచెర్లకు వచ్చిన విషయం తెలుసుకున్న చిన్న బావ కల్లుమడి ఎర్రిస్వామి వేణు వద్దకు వచ్చి గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఎర్రిస్వామి స్క్రూడ్రైవర్‌తో వేణుపై దాడి చేశాడు. దీంతో వేణుకు కడుపుకు తీవ్ర గాయాలయ్యాయి. వేణు కేకలు వేయడంలో గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. వేణు ఫిర్యాదు మేరకు ఎర్రిస్వామిపై శుక్రవారం రాత్రి హత్యయత్నం కేసు నమోదు చేసినట్లు జమేదార్ ఫిరోజ్ తెలిపారు.

ఉత్సాహంగా మహిళా దినోత్సవం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: నగరంలోని పలు ప్రాంత్రాల్లో ఉత్సాహంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పెనుకొండ టీడీపీ, జనసేన అభ్యర్థి సవిత వెంకటాపురం వచ్చి మాజీ మంత్రి పరిటాల సునీతకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత అనంతపురంలోని ఆ పార్టీ మహిళా కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతపురం రజకనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్త్రీవిముక్తి సంఘటన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలక్ష్మి, మల్లేశ్వరి మానవ హక్కుల వేదిక చంద్రశేఖర్, తరిమెల అమర్‌నాథ్ రెడ్డి, స్త్రీవిముక్తి సంఘటన కోశాధికారి త్రివేణి, రాధ, చైతన్యపాల్గొన్నారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో న్యూటౌన్ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గాయత్రి, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, గుత్తి డిప్యూటీ డీఈఓ శ్రీదేవి పాల్గొన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో డీఈఓ వరలక్ష్మిని డీఈఓ చాంబర్‌లో సన్మానించారు. నగరంలోని నలంద కాలేజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దాసరి వాసంతి సాహిత్య, ఏఐఎస్ఏ జిల్లా ప్రధానకార్యదర్శి అబ్దుల్ ఆలం పాల్గొన్నారు. నగరానికి చెందిన దాదాపు 30 మంది కళాకారిణిలను స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో శుక్రవారం సన్మానించారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి, దేవరకొండ కౌసల్య, యోగా శిక్షకురాలు క్రిష్ణవేణి, సుగుణమ్మ, గాయకురాలు శ్రీదేవి, జ్యోతి, విజయలక్ష్మి, వరలక్ష్మి తదితరులను ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్ష కార్యదర్శులు సురేష్, వీఎంపీ నాయుడు సన్మానించారు. ఎన్జీఓ హోంలో పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పలువురు మహిళలను సత్కరించారు. ఇందులో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ ప్రసూన, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు వెంకటరమణ, జిల్లా ఈసీ మెంబర్స్ నాగరాజేశ్వరీ పాల్గొన్నారు.




పరిటాల సునీతకు శుభాకాంక్షలు తెలుపుతున్న సవిత, మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న పెండ్యాల శ్రీలత




ఉపాధ్యాయ భవన్‌లో మహిళా కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు, మహిళలను సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు, అతిథులు


అలంకరణలో హటకేశ్వరస్వామి


రాజరాజేశ్వరి అమ్మవారు


పూజలందుకుంటున్న పరమేశ్వరుడు(పుట్లూరు)


అలంకరణలో కంబదూరు


అలంకరణలో జరుట్ల


గుంతకల్లులో అలంకరణలో


ప్రత్యేక అలంకరణలో


108 శివలింగాలను దర్శించుకుంటున్న



తొండపాడులో ప్రత్యేక


పశుపతినాథుని దేవాలయంలో దర్శనం చేసుకుంటున్న

పరమేశ్వరా.. పాహిమాం

శివరాత్రి వేడుకలు శుక్రవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. అభిషేకాలు, పూజలతో పరమేశ్వరుడిని పూజించారు. అర్ధరాత్రి 12 గంటల వరకు శివాలయాలలో లింగోద్భవ పూజలు జరిపించారు. పలు ఆలయాల్లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు శివాలయాలకు చేరుకుని భజనలు, భక్తి గీతాలతో జాగరణ చేశారు. - ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్


విరూపాక్షేశ్వర స్వామి


గవిసిద్ధేశ్వరుడు


కూడేరులో..


బుగ్గరామలింగేశ్వరుడు


రామలింగేశ్వరాలయంలో అలంకరణ (రాయదుర్గం)


గుత్తిలో వీరభద్ర ఖడ్గాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


బెళుగుప్ప రామేశ్వరాలయం వద్ద శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, భక్తులు


శ్రీధరఘట్టలో గంగాజలం తెస్తున్న దృశ్యం


చిన్నవడుగూరులో...


కణేకల్లులో ...


శివపార్వతులు (రాయదుర్గం)


పూజలు చేయిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి (తాడిపత్రి టౌన్)


శివాలయంలో భక్తుల పూజలు(కుందుర్పి)


అలంకరణలో కోన


పామిడిలో అలంకరణలో


భోగేశ్వరుడి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్‌కు పండితుడి ఆశీర్వాదం

ఆటో బోల్తా

తాడిపత్రిటౌన్, మార్చి8: మండలంలోని గదరగుట్టపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం ఆటో బోల్తా పడి నలుగురు కూలీలు గాయపడ్డారని రూరల్ ఎస్ఐ సాగర్ తెలిపారు. తాడిపత్రి నుంచి నంద్యాలజిల్లాకు కూలి పనుల కోసం ఆటోలో మొత్తం 10మంది వెళుతుండగా గదరగుట్టపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ఆటోకు కుక్కలు అడ్డు రావడంతో తప్పించబోయి బోల్తాపడింది.

రైతులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం విఫలం

బెళుగుప్ప, మార్చి 8: కరువుతో అల్లాడుతున్న మండల రైతులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని టీడీపీ నాయకులు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కన్వీనర్ ప్రసాద్, నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, ఆవులెన్న సర్పంచ్ రాము, గుండ్లపల్లి దేవప్ప, ఓబుళేసు కిష్టప్ప శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు మండలంగా ప్రకటించాలని తమ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తే బెళుగుప్పని జాబితాలో చేర్చినట్లు వైసీపీ నాయకులు మభ్య పెట్టారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో రెండు సార్లు పర్యటించినా సమస్య పరిష్కరించడానికి విశ్వేశ్వరరెడ్డి కృషి చేయలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో ప్రజల ఓటుతో మీకు బుద్ధి చెబుతారన్నారు.

లోకేశ్ పర్యటనను విజయవంతం చేయండి


టీడీపీలో చేరుతున్న మురడి గ్రామస్థులు

రాయదుర్గం, మార్చి 8: తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చే యా లని మాజీ మంత్రి, కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన నివాసంలో రాయదుర్గం పట్టణం, గుమ్మఘట్ట మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాయదుర్గంలో 10వ తేదీ మధ్యాహ్నం రాయల్ ఎంసీఏ కళాశాలలో జరిగే శంఖారావం కార్యక్రమంలో లోకేశ్ పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను తరలించాలన్నారు. జగన్ వైఫల్యాలు ఎత్తి చూపుతూ టీడీపీని అధికారంలోకి తీసుకురావడానికి చేపడుతున్న శంఖారావమును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టీడీపీలో 20 కుటుంబాలు చేరిక

డీ.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు శుక్రవారం వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరాయి. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తన నివాసంలో వారికి కండువాలు వేసి పార్టీలోకి చేర్చుకున్నారు. కురుబ తిప్పేస్వామి, రుద్ర ప్ప, వన్నూరుస్వామి, లింగప్ప, హనుమేష్, బోయ లింగప్ప, బోయ హనుమంతప్ప, బోయ రమేష్‌లతో పాటు వారి కుటుంబ సభ్యులు పార్టీలో చేరారు. మురడి ఎంపీటీసీ గంగాధర, సీనియర్ టీడీపీ నాయకులు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వీరంతా టీడీపీలో చేరారు.

గుంతకల్లు అభ్యర్థిని ప్రకటించండి: టీడీపీ

గుంతకల్లు, మార్చి 8: అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిని పార్టీ అధిష్టానం వెంటనే ప్రకటించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన గుత్తిలో నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమం ఉందని, ఆలోగా పార్టీ అభ్యర్థిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, కేశప్ప, పాల మల్లికార్జున, హనుమంతు, గిడ్డయ్య పజులు, కే సురేశ్, రాయల్ వెంకటేశులు పాల్గొన్నారు.

● గుంతకల్లు నియోజకవర్గ అసెంబ్లీ స్థానాన్ని గుమ్మనూరు జయరాంకు కేటాయించరాదంటూ తెలుగు మహిళలు ఆందోళన నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయం వద్ద నుంచీ ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో తలారి సరోజమ్మ, అరుణ, బండి లక్ష్మీదేవి, అంజలీ దేవి, సుమలత, మాధవి, జయమ్మ, లక్ష్మి, సరస్వతి, పార్వతి, అంజలి పాల్గొన్నారు.

పార్టీలో క్రమశిక్షణను పాటించాలి

గుంతకల్లు, మార్చి 8: టీడీపీ ఎంతో క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, పార్టీలో చేరిన గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు కూడా అదే క్రమశిక్షణతో మెలగాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ కుమార్ గౌడు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జితేంద్రగౌడు క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. పవన్‌కుమార్‌గౌడు మాట్లాడుతూ గుమ్మనూరు జయరాంకు పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్టును కేటాయించక ముందే తానే అభ్యర్థినని ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. దీంతో పార్టీలో గందరగోళం ప్రారంభమైందని, నాయకులు, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తున్నారని తెలిపారు. పార్టీలో ఉన్న వారు ఎవరైనా సరే టీడీపీ విధానాలను తెలుసుకుని అనుసరించాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, టీ కేశప్ప, హనుమంతు, శివప్ప, పజులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


కుట్టుమిషన్‌లను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఉరవకొండ, మార్చి8: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షులు జయకృష్ణ పేర్కొన్నారు. స్థానిక లయన్స్‌క్లబ్ యోగా సెంటర్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంటరి మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ సభ్యులు విశ్వనాథ్, లక్ష్మీనారాయణ, బాలచంద్ర, గణేష్‌బాబు, కృష్ణ మెహన్, శ్రీరాములు పాల్గొన్నారు.

కంచుకోటలో టీడీపీ జెండాను ఎగురవేద్దాం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు


అమిలినేని సురేంద్ర బాబుకు స్వీట్లు తినిపిస్తున్న తెలుగు మహిళలు

కళ్యాణదుర్గం మార్చి 8: టీడీపీకు కంచుకోట కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేద్దామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రజా వేదిక వద్ద బ్రహ్మసముద్రం మండల నాయకులు, కార్యకర్తలు కన్వీనర్ శ్రీరాములు ఆధ్వర్యంలో పెద్దఎత్తున సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీల వారిగా నాయకులు, కార్యకర్తలు సురేంద్రబాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలసికట్టుగా పని చేసి 50 వేల మెజార్టీతో గెలుపు సాధించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అరాచక పాలన పోవాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అవసరమన్నారు. తాను డబ్బు సంపాదన కోసం రాజకీయా ల్లోకి రాలేదని, అత్యంత వెనుకబడిన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఇక్కడకు వచ్చానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సురేంద్రబాబు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం ప్రజావేదిక వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే ఏ రంగంలోనైనా రాణించగలరని, వారు ధైర్యంగా ముందడుగు వేయాలన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో మహిళల కోసం ఎన్నో పథకాలను పొందిపరిచినట్లు వివరించారు. అంతకుముందు ప్రజావేదిక వద్ద కేక్ కట్ చేసి పంచిపెట్టి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

రాయదుర్గంరూరల్, మార్చి 8: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం వద్ద ఉన్న వేదవతి హగరి నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను వైఎస్సార్ సర్కిల్ వద్ద అదుపులోకి తీసుకుని రూ. 20 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

బెళుగుప్ప: కాలువపల్లి సమీపంలో పెన్నానది పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్ గుండ్లపల్లి సమీపంలో హగరి నది పరివాహక ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం రాత్రి పోలీసులు సీజ్ చేశారు. గనుల శాఖ అధికారులు స్వాధీనం చేస్తున్నట్లు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో పశువుల పాక, గుడిసె దగ్ధం


పూర్తిగా కాలిపోతున్న పూరిగుడిసె

బొమ్మనహాళ్, మార్చి 8: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో పూరెగుడిసె, పశువుల పాక దగ్ధమైన ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన మేరకు ఉద్దేహాళ్ గ్రామంలో క్యాంప్ కాలనీలో రోడ్డు వైపున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలు లేచి సత్యనారాయణకు పూరి గుడిసె, పశువుల పాకపై పడి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తేవడానికి ప్రయత్నం చేశారు. పూరెగుడిసెలో ఉన్న రూ.50 వేలు వ్యవసాయ పనిముట్లు, ఖాళీ సంచులు, పూరిగుడిసె దగ్ధమైంది.

యువకుడి ఆత్మహత్య

పెద్దపప్పూరు, మార్చి8: మండలంలోని ముచ్చుకోట అటవీ ప్రాంతంలో శుక్రవారం గార్లదిన్నె మండలం యర్ర గుంటపల్లి గ్రామానికి చెందిన ఎర్రిస్వామి (26) ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడని ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు. ఆయన తెలిపిన మేరకు యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఎర్రిస్వామికి మార్చి 7న వివాహం నిశ్చయం చేశారు. ఎర్రిస్వామికి మద్యం తాగే అలవాటు ఉందని తెలుసుకున్న అమ్మాయి తరపువారు వివాహాన్ని రద్దు చేసుకున్నారన్నారు. ఈ విషయాన్ని ఎర్రిస్వామి బంధువుల వద్ద చెప్పుకొని బాధపడుతుండేవాడు. ఈక్రమంలోనే మనస్తాపం చెందిన ఎర్రిస్వామి ముచ్చుకోట అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ తెలిపారు. ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

నేత్రపల్లిలో యువతి...

గుమ్మఘట్ట, మార్చి 8: మండలం నేత్రపల్లిలో మాలశ్రీ(18) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన మేరకు ఇంట్లో తల్లిదండ్రులు తిమ్మరాయప్ప, కుళ్లాయమ్మలు కూతురు మాలశ్రీతో తరచూ గొడవ పడుతుండేవారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె గురువారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగింది. రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

ఉరవకొండ, మార్చి 8: రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కేశవ్ తనయుడు విజయ్‌సింహా పేర్కొన్నారు. విడపనకల్లు మండలంలోని పెంచలపాడు గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాల వల్ల కలిగే లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ టీడీ మారయ్య, దేవేంద్రప్ప, భీమలింగ, శ్రీనివాసులు, పాల్గొన్నారు. అలాగే వజ్రకరూరు మండలం లో కమలపాడు, గూళ్యపాళ్యం గ్రామాలలో బాబు ష్యూరిటీ- భవిష్య త్తు గ్యారంటీ కార్యక్రమాలలో ఎమ్మెల్యే తనయుడు విక్రమ్‌సింహా పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటేశులు, తట్రగల్లు సుధాకర్, నాగేంద్ర, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కుందుర్పి, మార్చి 8: సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఉన్న విలువల బడుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మహిళ ఔన్నత్యం గురించి వివరించారు. కార్యక్రమంలో టైలరింగ్ శిక్షకురాలు అంబుజా, ఎస్‌కే చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు దిలీప్, ఉమాదేవి, యశోద, ఆయా గ్రామాల విలువల బడుల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులైన సరస్వతి, యశోద, నాగలక్ష్మి, అంజనాదేవిలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయులు కృష్ణ, సురేష్, వీర ఓబుళప్ప, జగదీశ్వర్ పాల్గొన్నారు.

యాడికి: మహిళల ఆర్థిక స్వావలంబనతోనే సమాజ అభివృద్ధి జరుగుతుందని యాడికి సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని యాడికిలో ఉపాధిపనులు నిర్వహిస్తున్న ప్రదేశం వద్ద మహిళలతో కలిసి ఆయన కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.


మహిళా దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

పెద్దవడుగూరు: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న యూడీసీ రమణమ్మ, సీహెచ్ఓ చిట్టితల్లిని డాక్టర్లు శ్రీనివాసబాబు, అమర్‌నాథ్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ విగ్రహానికి పూలమాల వేసిన జేసీ


విగ్రహానికి పూలమాల వేస్తున్న దివాకర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 8: పట్టణంలోని నంద్యాలరోడ్డులో తాడిపత్రి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహానికి మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేసీ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో మొదటితరం నాయకుల్లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రథముడన్నారు. ఆయన నింపిన స్ఫూర్తి సంగ్రామాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసిందని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రెడ్డిసంఘం నాయకులు పిచ్చిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూలమాలలు వేసిన రాయలసీమ ఉద్యమనేత

పట్టణంలోని నంద్యాలరోడ్డులో ఏర్పాటుచేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహానికి రాయలసీమ ఉద్యమనేత తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉయ్యాలవాడ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆయన వెంట రఫ్ నాయకులు భాస్కర్‌రెడ్డి, రాము, నాగరాజు ఉన్నారు.

శంఖారావం సభ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి8: పట్టణంలోని కడపరోడ్డులో ఈనెల 11న జరగనున్న టీడీపీ శంఖారావం సభకు సంబంధించిన పనులను శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గపరిధిలో తలపెట్టిన శంఖారావం కార్యక్రమానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ సభకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ నరేంద్రనాయుడు, టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కౌన్సిలర్ విజయ్‌కుమార్, చింబిలి ప్రసాద్‌నాయుడు, మల్లికార్జునరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మసీదులకు ఎమ్మెల్యే కేశవ్ విరాళం

ఉరవకొండ,మార్చి8: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీదులను శుభ్ర పరుచట కొరకు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ రూ.1.05లక్ష విరాళంగా ఇచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ మైనార్టీ నాయకులు మసీద్ ముతవల్లిలకు అందజేశారు. పట్టణంలోని 7 మసీదులకు గానూ ఒకొక్కక్క మసీదుకు రూ. 15 వేలు చొప్పున అందజేసినట్లు తెలిపారు.

దంతలపల్లిలో బాబు ష్యూరిటీ

యల్లనూరు, మార్చి8: మండలంలోని దంతలపల్లి గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. టీడీపీ, జనసేన పార్టీలకు సంబంధించిన పోస్టర్లను అతికిస్తూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. దంతలపల్లి టీడీపీ కార్యకర్తలు తేజరెడ్డి, విజయ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో 50 కుటుంబాల చేరిక

తాడిపత్రిటౌన్, మార్చి8: స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో పోరాట కాలనీకి చెందిన 50 కుటుంబాలు జనసేనలో చేరాయి. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రామాంజనేయులు, మహేశ్, కుళ్లాయప్ప, ప్రసాద్, పవన్‌కుమార్, దినేష్, మారెప్ప, వంశీ, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని కొళగానహళ్లి గ్రామంలో వైసీపీ నుండి జనసేన పార్టీలోకి శుక్రవారం 30 కుటుంబాలు చేరాయి. జనసేన పార్టీ రాయదుర్గం నియోజకవర్గం ఇన్‌చార్జ్ మంజునాథ్ సమక్షంలో వారు పార్టీలోకి చేరారు. జయరాం, ప్రసాద్, హనుమంతరెడ్డి, హరికృష్ణ, గంగాధర, ధనుంజయ, గోవిందు, అంజి, జగదీష్ తదితరులు వైసీపీ నుండి జనసేనలోకి చేరారు. కార్యక్రమంలో శివరాజ్, నవీన్, సికిందర్ లోకేష, కార్యకర్తలు రమేష్, శివరామ, సదానంద, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు మట్కా బీటర్ల అరెస్టు

రాయదుర్గం, మార్చి 8: మట్కా రాస్తున్నారన్న సమాచారంతో మండలంలోని చదం గ్రామానికి చెందిన వన్నూరప్ప, పల్లేపల్లి గ్రామానికి చెందిన రపం ఆంజనేయులును అదుపులోకి తీసుకున్నట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. డీహీరేహాళ్ మండలం హొసగుడ్డం గ్రామానికి చెందిన సురేష్, కల్యం గ్రామానికి చెందిన తిప్పేస్వామిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుండి రూ. 21,130 నగదుతో పాటు మట్కా చీటీలను స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.